# కృషివుంటే...

"నీ పేరు?" అడిగాడు ఆఫీసర్ ఇంట ర్వ్యూలో
"శంకర్"
"నీ తండ్రి పేరు?"
"సుందరయ్య"
"మీ కుటుంబ పరిస్థితి చెప్పు"
"మా నాన్నగారు చనిపోయారు. మా అమ్మ కూలీ కష్టం చేసి నన్ను డిగ్రీ చదివించింది. నలుగురు అక్కా చెల్లెళ్ళకు నే నొక్కడినే ఆధారం."
"కంప్యూటర్స్ చేయలేదా?"
"అంత స్తోమత లేదు సార్" అన్నాడు శంకర్ నీరసంగా
"మేము కంప్యూటర్స్ చేసిన వాళ్ళనే తీసుకోవా లని నిర్ణయం తీసుకున్నాం. నీవు వెళ్ళవచ్చు."

శంకర్‌కు మారో ఇంటర్వ్యూ కూడా నిరాశనే మిగిల్చింది. నిస్పృహతో. ఇంటికి బయలుదేరాడు.
ఈ ఇంటర్వ్యూకే చెట్టంత ఎదిగిన కొడుకు చెట్టులా నీడ నిస్తాడని కలలు కన్న తల్లి ఇంట్లో బియ్యం కొనడానికి తీసివుంచిన డబ్బులు తన చేతికిచ్చి పంపింది. కానీ, చివరికి తన చదువు తనకు, తన వాళ్ళకు అన్నం పెట్టక



పోగా నిరాశ అనే ఊబిలోకి ఇంకా కూరుకునేలా చేస్తుందనుకోలేదు.
దారిలో కళ్ళ ముందు ఎన్నో ఊహాలు కదలాడ సాగాయి.
ఉద్యోగం లేకుండా ఇంటికి వెళ్ళకూడదనుకుని ఒక నిర్ణయాని కొచ్చాడు.
తనకు తెలిసిన మోటర్ మెకానికల్ షాపులో పని నేర్చుకునేందుకు సిద్ధమై ఆ దిశగా అడుగులు వేశాడు.
శంకర్ పరిస్థితి తెలిసిన షాపు ఓనర్ "ఇంత చదివిన నీవు ఈ పని చేయగలవా? ", అన్నాడు.
"మీరు అప్పగించిన ఏ పనినైనా చేయడానికి సిద్ధంగా వున్నాను" ఓటమిని అంగీకరించని సైని కునిలా అన్నాడు.
"సరే నీ యిష్టం. ఇందులో పని నేర్చుకుంటే నీ కాళ్ళమీద నీవు నిలబడగలవు, మీయింటి వాళ్ళకు ఓ దారి కూడా చూపగలవు, కమాన్ క్యారీ ఆన్" అన్నాడు అభిమానంగా.
ఇప్పుడతని చదువు తన అభిమానాన్ని చంపే యడం లేదు. ఆకలితో అలమటించే కడుపులకు పిడికెడు మెతుకులు పెట్టగలుగుతోంది. రోజు రోజుకూ తన తెలివినంతా ఉపయోగించి హుషా రుగా మెకానిజం నేర్చుకుంటున్నాడు.

* * * *

కొన్నాళ్లకు సొంతంగా మెకానికల్ షాపు పెట్టాడు శంకర్.
తల్లి ఆనందానికి అవధుల్లేకపోయాయి. కొడుకు ప్రయోజకుడైతే ఏ తల్లికైనా అంతకు మించిన ఆనందం ఏముంటుంది.
ఇప్పుడతడు రోజుకు కొన్ని వేలు సంపాదిస్తున్నాడు. ఎంతో మందికి ఉపాధి కలిగిస్తున్నాడు.
ఎక్కువ మైలేజినిస్తూ అత్యంత వేగంగా వెళ్ళే అత్యాధునికమైన కారుని ప్రపంచంలోనే ఎవరూ కనిపెట్టలేని రీతిలో కనిపెట్టాడు శంకర్ కొద్ది రోజుల్లోనే.
ఒకరాత్రి శంకర్ డైరీ రాసుకుంటూ తనలో తనే ఇలా అనుకున్నాడు"ఒక మామూలు ఉద్యోగినైతే తనింత స్థాయికి ఎదిగే వాణ్ణి కాదు కదా? స్వయం కృషితో సాధించలేనిది లేదు కదా!" అని. అందుకే అంటారు 'కృషితో నాస్తి దుర్భిక్షం.'

—పి.వి.శివరామయ్య



సెప్టెంబర్ 19న తేదీన హైదరాబాద్‌లో జరిగిన 'మిస్ ఆంధ్రా కాంటెస్ట్'లో విజేత మిస్ ఆంధ్రా సోఫియాసిన్హాకు, ఈ కార్యక్రమం స్పాన్సర్స్‌లో ఒకరైన 'మెడిమిక్స్' వారు బంగారు ఉంగరం బహూకరిస్తున్న దృశ్యం.